క్లుప్తంగా

పంచాయతీ రికార్డుల నమోదు తప్పనిసరి



జుంటుపల్లిలో ఇంటి నిర్మాణ అనుమతులను పరిశీలిస్తున్న ఎంపీఓ యాదయ్య

యాలాల: పంచాయతీ రికార్డులను తప్పనిసరిగా నమోదు చేయాలని మండల పంచాయతీ అధికారి గాలి యాదయ్య పేర్కొన్నారు. బుధవారం మండలంలోని జుంటుపల్లి గ్రామంలో ఆయన పర్యటించారు. అంతకుముందు గ్రామంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాల అనుమతులను పరిశీలించారు. గ్రామస్తులు ఇంటి పన్ను తప్పకుండా చెల్లించాలని సూచించారు. ఇంటి నిర్మాణ పనులకు పంచాయతీ నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. అనంతరం పంచాయతీ రికార్డులు, పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శితో పాటు గ్రామస్తులు ఉన్నారు.

వీరజవాన్లకు ఘన నివాళి



మోమిన్‌పేటలో ర్యాలీ

మోమిన్‌పేట: మోమిన్‌పేటలో బుధవారం ఆపరేషన్ సిందూర్‌లో మృతి చెందిన వీర జవాన్లకు అశ్రునివాళి ర్యాలీ నిర్వహించారు. ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు. దేశం కోసం పోరాడి వీర మరణం పొందిన జవాన్ల కుటుంబాలను కీర్తించారు.

మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య



పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య

కొత్తూరు: మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చైర్‌పర్సన్ లావణ్య అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో బుధవారం డ్రైనేజీ పైపు లైను పనులను ఆమె ప్రారంభించారు. మున్సిపాలిటీ సాధారణ నిధులు రూ.5లక్షలతో పనులు చేపడుతున్నామన్నారు. అన్ని వార్డుల్లో ప్రాధాన్యత క్రమంలో పనులు చేస్తున్నట్లు వెల్లడించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారరు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, వైస్ చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు కోస్గి శ్రీనివాస్, నర్సింలుగౌడ్, సోమ్లునాయక్, నాయకులు దేవేందర్‌యాదవ్, జనార్ధన్‌రెడ్డి, రాజేందర్‌గౌడ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కళాశాల నిర్మాణానికి విరాళం



ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న పరిశ్రమ యాజమాన్యం

షాద్‌నగర్: దాతల సహాయంలో పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి కొత్తూరు మండల పరిధిలోని తీగాపూర్ గ్రామ శివారులో ఉన్న బింజుసారియా ఇస్పాత్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ వారు రూ.11లక్షల విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా పరిశ్రమ సిబ్బంది వినోద్‌కుమార్ కేడియా తన తండ్రి భన్వరీలాల్ కేడియా జ్ఞాపకార్థం విరాళానికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది మోముల బసప్ప, పరిశ్రమ యజమాని హితేశ్ కేడీయా తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

షాబాద్: రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పామెన నర్సింలు అన్నారు. బుధవారం మండల పరిధిలోని పోతుగల్ గ్రామంలో ప్రభుత్వం ద్వారా మంజూరైనా 31 ఇందిరమ్మ ఇళ్లకు కొలతలు చేసి ముగ్గులు పోశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, గ్రామస్తులు గోపాల్‌రెడ్డి, కృష్ణ, రాజు తదితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరా అస్తవ్యస్తం!

- కరెంట్ తీగలకు అల్లుకుంటున్న చెట్ల పొదలు, అడ్డువచ్చే కొమ్మలు
- గాలి వస్తే గంటల తరబడి నిలిపేత
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

నవాబుపేట: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండడం లేదు. అధికారుల నిర్లక్ష్యం వల్ల గంటల తరబడి అంతరాయం కలుగుతుంది. ప్రతిరోజు సరఫరా సక్రమంగా ఉండడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైర్లకు చెట్ల కొమ్మలు, పొదలు అల్లుకోవడంతో కొంత కాలంగా మెరుగైన సరఫరా జరగడం లేదు. అంతేకాకుండా బలమైన గాలులకు, వర్షాలు వచ్చినప్పుడు పొలాల్లో పాతిన స్తంభాలు ఒరిగిపోవడంతో, అక్కడక్కడ వైర్లు నేలకు రాసుకోవడంతో సరఫరాలో తరచూ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ విషయాన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారు. కరెంటు సరఫరా సక్రమంగా లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గాలిదుమ్ము, వర్షాలు వస్తే అంతే సంగతులు గంటల తరబడి సరఫరా నిలిపేస్తున్నారని చెబుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల చెట్లకొమ్మలు, పొదలు ఏపుగా పెరిగిపోయాయి. కరెంటు వైర్లను ముంచెస్తున్నా వాటిని తొలగించే సిబ్బందే లేరు. ఏపుగా పెరిగే చెట్ల కొమ్మలు, లైన్లకు అడ్డువచ్చే కొమ్మలు, పొదలను తొలగించే సిబ్బంది ఎందుకు పట్టించుకోవడంలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. మండల పరిధిలోని మైతాప్‌ఖాన్‌గూడ, అక్నాపూర్, ఎల్లకొండ, లింగంపల్లి, నారెగూడ, గంగ్యాడ, చిట్టిగిద్ద, పులుమామిడి తదితర గ్రామాలకు సరఫరా అయ్యే విద్యుత్ వైర్లు చెట్ల కొమ్మలు, పొదల్లో చిక్కుకొని ఉన్నాయి. దీంతో గాలి వీచినప్పుడల్లా తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. గాలి బలంగా వీస్తే వైర్లు రాసుకొని మంటలు వస్తుండడంతో సమీప గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.



గొల్లగూడలోని పొలాల్లో ఒరిగిన స్తంభాలు



సాయన్నగూడ గేట్ వద్ద చెట్ల కొమ్మల మధ్య తీగలు

వర్షం పడితే రాత్రి సమయాల్లో పొలాల్లో వెళ్లని సిబ్బంది

మండలంలోని చాలా గ్రామాలకు సరఫరా అయ్యే విద్యుత్ లైన్లు పొలాల్లో నుంచే ఉన్నాయి. దీంతో గాలి వీచినా, భారీ వర్షాలు పడినా కరెంటు స్తంభాలు నేలకు ఒరగడం పరిపాటిగా మారింది. పొలం గట్ల మీద ఉండే చెట్ల కొమ్మలు తగలడం వల్ల కరెంటు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. వర్షం పడటం వల్ల రాత్రి సమయాల్లో సిబ్బంది పంటపొలాల్లోకి వెళ్ల లేకపోతున్నామని వారు చెబుతున్నారు. రైతుల పొలాల్లో నుంచి లైన్లను తొలగించి రోడ్డు పక్క నుంచి లైన్లు ఏర్పాటు చేయిస్తే సమస్య కొంత మేర నివారించొచ్చని చెబుతున్నారు.

పలుమార్లు ఫిర్యాదు చేసినా..

మండలంలోని పలు గ్రామాల్లో వైర్లు చెట్ల పొదల్లో అల్లుకొని ఉన్నాయని ఆయా గ్రామాల ప్రజలు పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సమస్య పరిష్కరిస్తాం..

మండంలోని పలు గ్రామాల్లో సమస్యలు ఉన్నాయి. గతంలో కొన్ని గ్రామాల్లో సమస్య పరిష్కరించాం. ఇంకా అక్కడక్కడ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంది. విద్యుత్ వైర్లకు తగులుతున్న చెట్లకొమ్మలు, పొదలను నరికి వేయిస్తాం. సమస్యను వెంటనే పరిష్కరిస్తాం.
– శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ

గాలి వీస్తే..



వర్షాకాలం, ఎండాకాలం ఏదైనా సరే కాస్త బలమైన గాలి వీస్తే కరెంటు పోతుంది. ఏమైందని అడిగితే చెట్ల కొమ్మలు విరిగి తీగల మీదపడ్డాయని చెబుతారు.
– ఆనంద్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు, ముబారక్‌పూర్

కరెంటు ఉండడం లేదు..



గ్రామాల్లో కరెంటు సమస్య పట్టించుకోవడం లేదు. కరెంటు సరఫరా గంట కూడా ఉండటంలేదు. ఈ విషయంలో అధికారులు, సిబ్బంది ఏం చేస్తున్నారో వారికే తెలియాలి.
– ప్రభాకర్, కాంగ్రెస్ నాయకుడు, మాదిరెడ్డిపల్లి

పొలాల్లో లైన్లు తీసివేయాలి



మండల పరిధిలోని చించల్‌పేట నుంచి గుబ్బడిపత్తేపూర్ వరకు కరెంటు సరఫరా అయ్యే విద్యుత్‌లైన్లు పొలాల నుంచే ఉన్నాయి. పొలాల మధ్య ఉండే చెట్ల కొమ్మలు రాసుకుంటే కరెంటు సరఫరాకు ఏర్పడుతుంది.
– గోవిందమ్మమల్లేశం, మాజీ సర్పంచ్, గంగ్యాద

అల్లుకుపోతున్న పొదలు..



ఏపుగా పెరుగుతున్న చెట్టుకొమ్మలు, విద్యుత్ తీగలకు అల్లుకుపోతున్నాయి. పొదలతో సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.
– వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్, ఎల్లకొండ

లక్ష్మీ నరసింహ స్వామికి పూజలు

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



పూజలో బీజేపీ నాయకులు

పూడూరు: మండల పరిధిలోని రాకంచెర్ల గ్రామంలో శ్రీయోగానంద లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం బీజేపీ పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జి మారుతి కిరణ్ బూనేటి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవులు, పరిగి అసెంబ్లీ కన్వీనర్ ఉగ్ర నరసింహ, జిల్లా కార్యవర్గ సభ్యుడు జాజుల అనిల్, శేరి రాంరెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు వెంకటయ్య, సీనియర్ నాయకులు మాణిక్యం, బీజేవైఎం పరిగి అసెంబ్లీ కో కన్వీనర్ మనోహర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ రెడ్డి, మండల నాయకులు, పాల్గొన్నారు.

నేడు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

యాలాల: మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి శ్వేతరాణి తెలిపారు. ఉదయం 8 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమానికి శాస్త్రవేత్తలు, వ్యవసాయ ఉన్నతాధికారులతో పాటు జిల్లా వ్యవసాయ అధికారి హాజరవుతారని ఏఓ తెలిపారు.

నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపట్టాలి



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నివాస ప్రాంతాలకు వెళ్లి సర్వే చేస్తున్న అధికారులు



దోమ: ఊటుపల్లిలో అర్హుల వివరాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గ్యామా

కుల్కచర్ల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు నిబంధనల ప్రకారం చేపట్టాలని చౌడాపూర్ ఎంపీడీఓ సోమలింగం పేర్కొన్నారు. బుధవారం చౌడాపూర్ మండల పరిధిలోని చాకల్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారుల నివాసప్రాంతాలకు వెళ్లి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నిబంధనలకనుగుణంగా ఇళ్లను నిర్మించుకోవాలన్నారు. లబ్ధిదారులు ఖచ్చితంగా నూతన పునాది నిర్మాణంతో పనులు మొదలు పెట్టాలన్నారు. నిర్మాణ పనుల పరిశీలన అనంతరమే తదుపరి బిల్లుల చెల్లింపులు కొనసాగుతాయని పేర్కొన్నా రు. అర్హులైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఓ రాజిరెడ్డి, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, శేఖర్, స్థానిక జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు..

దోమ: అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎంపీడీఓ గ్యామా అన్నారు. బుధవారం దోమ మండల పరిధిలోని ఊటుపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నివాస ప్రాంతాలకు వెళ్లి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం ఇళ్లు లేని పేద కుటుంబాలకు ఇంటిని నిర్మించి ఇచ్చేలా చర్యలు తీసుకుంటుందన్నారు. అందులో భాగంగానే గ్రామ గ్రామాన కమిటీలు వేసి ఇందిరమ్మ ఇళ్ల అర్హులను గుర్తించిందన్నారు. ప్రతి గ్రామంలో కమిటీలు ఎంపిక చేసిన అభ్యర్థులను పూర్తి స్థాయిలో పరిశీలిస్తుందన్నారు. జాబితాలో అనర్హుల పేర్లు ఉంటే తొలగిస్తామని హెచ్చరించారు. పేద కుటుంబాలు ఎలాంటి ఆందోళన చెందొద్దన్నారు. ప్రభుత్వం ప్రతి పేదోడికి ఇంటిని నిర్మించి ఇచ్చేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొడంగల్ రూరల్: మండలంలో 132కెవీ లైన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించే పనుల వల్ల గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని పర్సాపూర్, గుండ్లకుంట, కొండారెడ్డిపల్లి, పాతకొడంగల్ గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గ్రహించి విద్యుత్ అధికారులకు సహకరించాలని ఏఈ తెలిపారు.

బీసీ సేన గ్రామ కమిటీల ఏర్పాటు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం వీరసముద్రం, లచ్చంపేట గ్రామాల్లో బుధవారం బీసీసేన మండల మహిళా అధ్యక్షురాలు ప్యాట జయ ఆధ్వర్యంలో గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీరసముద్రం గ్రామ కమిటీ అధ్యక్షురాలిగా జానంపేట యాదమ్మ, ఉపాధ్యక్షురాలిగా పి.యాదమ్మ, ప్రధాన కార్యదర్శిగా కవిత, కార్యదర్శిగా టి.యాదమ్మ, కోశాధికారిగా మంజుల ఎన్నికయ్యారు. లచ్చంపేట గ్రామ కమిటీ అధ్యక్షురాలిగా వెంకటమ్మ, ఉపాధ్యక్షురాలిగా బిపాషా, ప్రధాన కార్యదర్శిగా మనీల, కోశాధికారిగా వీరమణి ఎన్నికయ్యారు. బీసీ సేన జిల్లా ఉపాధ్యక్షుడు పస్పుల ప్రశాంత్, జూపల్లి చంద్రశేఖర్, వెంకటేశ్, బాల్‌రాజ్, శ్రీనివాసు పాల్గొన్నారు.

ఉత్సవాల నిర్వహణకు విరాళం

షాబాద్: నాన్‌ంధార్‌ఖాన్‌పేట్ గ్రామంలో 19వ తేదీన నిర్వహించనున్న బొడ్రాయి, మైసమ్మ ఉత్సవానికి రావాలని కోరుతూ గ్రామస్తులు దామర్లపల్లి మాజీ సర్పంచ్ బొకుల లింగంను కలిసి బుధవారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఉత్సవాల నిర్వహణకు రూ.25వేలు విరాళం గ్రామస్తులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. ఆయన శివస్వాములకు ఉచితంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ నారాయణరెడ్డి, నాయకులు కేసారం కృష్ణ, దయాకర్ చారి, సురేష్, వినోద్, కాట్నా విశ్వనాథం, కర్రె కృష్ణ, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

పేదల ప్రభుత్వం కాంగ్రెస్

కుల్కచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు

కుల్కచర్ల: కాంగ్రెస్ అంటేనే పేదల ప్రభుత్వమని కుల్కచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. బుధవారం కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ గ్రామంలో గ్రామానికి చెందిన సార సుగుణమ్మ కొన్ని నెలల క్రితం అనారోగ్య సమస్యతో చికిత్స చేయించుకున్నారు. ఆమెకు మంజూరైన రూ. 24వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు ముదిరాజ్ మాట్లాడుతూ..రాజకీయాలతో సంబంధం లేకుండా ఆపదలో ఉన్న ప్రతీ ఒక్కరికి సీఎం సహాయ నిధి అండగా నిలుస్తుందన్నారు. పేదలకు ఈ నిధి వరమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు చంద్రయ్య, సోమలింగం, భాస్కర్, బాలకృష్ణ, షర్ఫొద్దీన్, యాదయ్య, బాలు పాల్గొన్నారు.



లబ్ధిదారుని కుటుంబానికి చెక్కు అందిస్తున్న ఆంజనేయులు, స్థానిక నాయకులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1990–92లో ఇంటర్ విద్య పూర్తి చేసిన విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారందరూ ఒక్కచోట చేరి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆనందంగా గడిపారు. కళాశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందజేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో సుధాకర్, జూపల్లి చంద్రశేఖర్, ఆశీర్వాదం, హరీశ్వర్, ముకుందర్‌రెడ్డి, శ్రీనివాస్, బండ శ్రీనివాస్, రాజేందర్, బాస వరలక్ష్మీ, మాధవిలత, కొట్టె ప్రసన్న, శ్రీలత, అరుణ, వసుధ, స్వర్ణలత, గడ్డం మాధవి, సుజాత, రామలక్ష్మీ, మంజు, మాధవి, ప్రభావతి, జ్యోతి, రేఖ, వనజ తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే కాలె యాదయ్య

శంకర్‌పల్లి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని క్రిష్టల్ వెంచర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన దేవాలయంలో హనుమాన్, పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలు, నవగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ పాపారావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, నాయకులు ప్రవీణ్, పాండు రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి

మహిళలు స్వశక్తితో ఎదిగి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆకాంక్షించారు. బుధవారం పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, అదేవిధంగా వారి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ మల్లేశ్వరి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాశెట్టి మోహన్, మున్సిపల్ కమిషనర్ యోగేశ్, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, రఘునందన్ రెడ్డి పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యాదయ్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

సార్వత్మిక సమ్మెను విజయవంతం చేయండి

షాబాద్: కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తోందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. బుధవారం సీతారాంపూర్ ఒలెక్ట్రాక్ బస్సుల కంపెనీ ఎదుట కార్మికులతో కలిసి సార్వత్రిక సమ్మె వాల్‌పోస్టర్‌ను పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చిందన్నారు. దీని ఫలితంగా కార్మికులు ప్రశ్నించే తత్వాన్ని కోల్పోయి బానిసత్వంలోకి నెట్టివేయబడతారని ఆరోపించారు. మండలంలో ఉన్న కంపెనీల కార్మికులు పెద్దసంఖ్యలో సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. తమ హక్కులను రక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ నర్సింహ, ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సుల కంపెనీ కార్మికులు, తదితరులు ఉన్నారు.

కార్మికుల హక్కుల సాధనకు పోరాటం

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జంగయ్య

కొందుర్గు: కార్మికుల హక్కుల సాధనకు నిరంతరం పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య అన్నారు. హక్కుల సాధన కోసం ఈ నెల 20న చేపడుతున్న సార్వత్రిక సమ్మె నోటీసును బుధవారం గ్రామ పంచాయతీ కార్మికుల తరఫున జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా బుద్దుల జంగయ్య మాట్లాడుతూ.. కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. వంద ఏళ్లుగా ఉన్న కార్మిక చట్టాలను బీజేపీ హరిస్తూ కార్పొరేట్ శక్తులకు వత్తాసు పలుకుతోందని ఆరోపించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడం కోసం ఈ నెల 20న సమ్మె చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు పాపయ్య, నాయకులు చంద్రమ్మ, రాములమ్మ, జంగయ్య, రమేశ్, ఈదమ్మ పాల్గొన్నారు.



బంట్వారం: కోట్‌పల్లిలో కురుస్తున్న జల్లులు



ధారూరులో కురుస్తున్న వర్షం

చల్లబడిన వాతావరణం

భగభగ మండుతున్న ఎండల నుంచి ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది. బుధవారం సాయంత్రం వాతావరణం ఒక్క సారిగా చల్లబడింది. కోట్‌పల్లి, ధారూర్ మండల కేంద్రంలో అరగంటకు పైగా చిరుజల్లులు కురిశాయి. బంట్వారంలో కాసేపు చినుకులతో కూడిన వర్షం కురిసింది.